

ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో మీ భవిష్యత్తు, మీ బిడ్డల భవిష్యత్తుకు ఆలోచించి ఓటు వేయాలి. నా కష్టం, నా శ్రమ అంతా మీ, మీ బిడ్డల భవిష్యత్తు కోసమే.. మీ ఆశీస్సుల కోసం వచ్చా.. ఓటు వేసి ఆశీర్వదించండి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు మీ ఓటు కీలకం.



ఆలోచించి.. ఓటేయండి!





జన..సేనుడు : రోడ్ షో, బహిరంగ సభకు వెల్లువలా తరలివచ్చిన జనం





నాకిది చాలన్నా : పవన్ వద్దకు రాగానే అంధురాలి ఆనందం





హత్తుకున్న పవన్ అభిమానం..

ఆంధ్రప్రదేశ్ దశ దిశ మార్చే ఎన్నికలివి..

- పిఠాపురాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతా
- ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ చేస్తా
- పురుషోత్తపట్నం వినియోగంలోకి తెస్తా
- సెజ్‌లో పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి
- ఉప్పాడ-కాకినాడ బీచ్‌ను అభివృద్ధి చేస్తా
- పిఠాపురం వారాహి సభలో పవన్‌కల్యాణ్

పిఠాపురం, మే 10: ఏపీ దశ దిశ మార్చే ఎన్నికలు ఇవి.. 25 ఏళ్ల ఏపీ భవిష్యత్తుకు మొదటి బీజం దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురాన్నే పడుతుంది..మోడల్ నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దుతా..అభివృద్ధి అంటే పిఠాపురంలా ఉండాలని, పార్లమెంట్ అంటే కాకినాడ లోక్‌సభ నియోజకవర్గంలా ఉండాలని దేశం మొత్తం ఇటు వైపు చూసేలా చేస్తానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు.పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్ బంగారమ్మ రావిచెట్టు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన వారాహి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అద్భుతమైన పిఠాపురంగా తయారు చేయాలన్నదే తన ధ్యేయమన్నారు. పిఠాపురం పట్టణానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తామని, ఉప్పాడ రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణం చేపట్టే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. పిఠాపురంలో విద్యుత్ వైర్లు బయటకు వేలాడుతూ కనిపిస్తున్నాయని..అవి బయటకు కనబడకుండా చేసే ఆలోచన చేస్తానని చెప్పారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ సహకారంతో ఏలేరు, సుద్దగడ్డ, పీబీసీ ఆధునికీకరణతో పాటు పురుషోత్తపట్టణం ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తెస్తామని తెలిపారు. నియోజకవర్గంలో సాగు,తాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని, ప్రతి మండలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పారు. ఉప్పాడ నుంచి కాకినాడ వరకూ బీచ్ అభివృద్ధి చేసి దేశంలోని ప్రజలంతా ఇక్కడకు వచ్చేలా చేస్తామని తెలిపారు. కాకినాడ సెజ్‌లో 8 వేల ఎకరాలు సేకరించి ఇంకా పలువురు రైతులకు పరిహారం ఇవ్వలేదని, ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదని, ఒక్క పరిశ్రమ తీసుకురాలేకపోయారని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సెజ్‌లో పరిశ్రమలు తీసుకువచ్చి పిఠాపురంతో పాటు కాకినాడ జిల్లా యువతకు ఇక్కడ ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. తనకు మద్దతుగా సాయిధరమ్‌తేజ్ ప్రచారానికి వస్తే అతడిపై వైసీపీ గూండాలు డ్రింక్ బాటిల్‌తో దాడి చేశారని, అది తగిలి తెలుగుదేశం తమ్ముడు నల్లల శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయని..అతడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని తెలిపారు. వైసీపీ గూండాలను తాను హెచ్చరిస్తున్నానని..రాబోయే కూటమి ప్రభుత్వంలో వారికి తగిన శాస్తి చేస్తామని చెప్పారు. కులాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేసేవాడిని కానని స్పష్టం చేశారు. పిఠాపురంలో తాను ఎందుకు నిలబడ్డానో తెలుసుకునేందుకు మే 13న ఇక్కడకు రావాలని తన భార్యను కోరినట్టు తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి అనేది కనిపించకుండా చేశారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ విమర్శించారు. ఐదేళ్లపాటు ఏనాడూ ప్రజలకు కనిపించని వంగా గీత నేడు ఎన్నికల వేళ ప్రజల ముందుకు వచ్చిందని ఎద్దేవా చేశారు. గీతకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్మ తనయుడు గిరీష్ వర్మ, జనసేన నాయకులు కదారి తమ్మయ్యనాయుడు పాల్గొన్నారు.

నెం 4పై నొక్కండి..

పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న తనకు చతుర్ముఖ బ్రహ్మలా బ్యాలెట్‌లో నాలుగో నెంబరులో ఉన్న గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేయాలని, కాకినాడ ఎంపీగా పోటీ చేస్తున్న తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు తొమ్మిదో నెంబరులో ఉన్న గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఉప్పొంగిన జనం..

పిఠాపురం/గొల్లప్రోలు/పిఠాపురం రూరల్/గొల్లప్రోలు రూరల్, మే 10 : జనకెరటం ఉప్పొంగింది. రహదారులన్నీ జాతరను తలపించాయి.ప్రజలు ఉప్పెనలా తరలివచ్చి పవన్‌కు నీరాజనాలు పలికారు. మహిళలు పూల వర్షం కురిపించి హారతులిచ్చారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శుక్రవారం నిర్వహించిన రోడ్‌షోకు అపూర్వ స్పందన లభించింది. ఆర్వోబీ మీదుగా పిఠాపురం మండల పరిషత్ కార్యాలయం పక్క రోడ్డు నుంచి జగ్గయ్యచెరువు కాలనీ, పశువుల ఆస్పత్రి, అపార్ట్‌మెంట్లు, సామర్లకోట రోడ్డు, పాదగయ జంక్షన్ వరకూ రోడ్ షో సాగింది. సమయాభావంతో బైపాస్ రోడ్ మీదుగా పవన్ గొల్లప్రోలు చేరుకోగా పట్టణ రహదారులన్నీ జన సంద్రమయ్యాయి. పుర కార్యాలయం సెంటర్‌లో మహిళలు బెలూన్లతో స్వాగతం పలికారు. పలుచోట్ల చిన్నారులను ఎత్తుకున్నారు. చేబ్రోలు శివాలయం, మల్లవరం సెంటర్ మీదుగా ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం గ్రామాల్లో రోడ్‌షో కొనసాగించారు. కొత్తపల్లి మండలంలో రోడ్‌షో కొనసాగింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన కొమ్మూరి గంగాధర్ తాను ల్యాండ్ టైటిలింగ్ చట్టానికి బాధితుడనని తెలుపుతూ చిత్రాడలో ప్లకార్డు ప్రదర్శించగా పవన్‌కల్యాణ్ స్పందించి ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని తెలిపారు.



ఇదే టీమ్ : పవన్, శ్రీనివాస్ వర్మ అభివాదం

6 గంటలు ఆలస్యంగా..

ఉదయం 9 గంటలకు రోడ్‌షో ప్రారంభమవుతుందని ముందుగా చెప్పినప్పటికీ ఆరు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది.ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురవడంతో హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతులు రావడంలో జాప్యం జరిగింది. దీంతో ఉదయం 10 గంటలకు గొల్లప్రోలు హెలిపాడ్‌కు రావాల్సిన పవన్ మధ్యాహ్నం 12.50 గంటలకు చేరుకున్నారు. అక్కడి నుంచి చేబ్రోలులోని నివాసానికి వెళ్లిపోయారు. మధ్యాహ్నం 2.50 గంటలకు ఆయన నివాసం నుంచి బయలుదేరి పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి 3.20 గంటలకు చేరుకున్నారు. మహాలక్ష్మి ఆలయం నుంచి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్, జానీ మాస్టర్‌లతో కలిసి రోడ్‌షో చేశారు.



పవన్‌కు జేజేలు : పిఠాపురంలో పవన్‌కు జై కొడుతున్న జనం



మేమూ మీ వెంటే : పిఠాపురంలో పవన్‌కు మహిళల స్వాగతం



నీ చేయి తగిలినా చాలన్నా : పిఠాపురంలో యువత క్యూ

మండపేటలో నాలుగోసారీ

పాగా వేసేది నేనే

మండపేట ఎమ్మెల్యేగా మూడుసార్లు వరుసగా గెలిచి హ్యాట్రిక్ సాధించిన ధీరుడు... టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల సహకారంతో నాలుగోసారీ విజయబావుటా ఎగురువేస్తానంటున్నారు మండపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు. ఇందుకోసం ఆయన రోజుకు 15 గంటలకు పైగా ప్రజాక్షేత్రంలోనే ఉంటూ ప్రచారం సాగిస్తున్నారు. పలు సామాజిక వర్గాలు, అసోసియేషన్ల ఆత్మీయ సమావేశాలకు హాజరై వైసీపీ నేతల అరాచకాలను వివరిస్తున్నారు. సైకిల్ గుర్తుకు ఓటేసి కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టాలని కోరుతున్నారు.

అభ్యర్థితో ఒకరోజు కార్యక్రమంలో భాగంగా మండపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి
వేగుళ్ల జోగేశ్వరరావుతో
'ఆంధ్రజ్యోతి' ప్రయాణం.... 6లో



'ఆంధ్రజ్యోతి' చదువుతూ...

అభ్యర్థితో.. ఒకరోజు

నియంత పాలనకు చరమగీతం పాడేందుకు

ప్రజలు సంసిద్ధం

అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్

సార్వత్రిక ఎన్నికల ప్రచార ఘట్టం ముగింపు దశకు చేరుకుంది. దాంతో అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ క్షణం తీరిక లేకుండా ప్రచార పర్వంలో మునిగిపోయారు. ఇంటింటా ప్రచారాలతో పాటు మండుటెండను సైతం లెక్కచేయక పాదయాత్రలు, రోడ్‌షోలు నిర్వహించారు. ఆయనకు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలుకగా యువత పూలవర్షం కురిపించింది. ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందనతో అలసట తెలియకుండా చెరగని చిరునవ్వుతో రాత్రి 10 గంటల దాకా ప్రచారం కొనసాగించారు. ఆ తర్వాత ముఖ్య నాయకులతో ఎన్నికల వ్యూహాలపై చర్చించి అర్ధరాత్రి వేళ నిద్రకు ఉపక్రమించారు.



తాళ్లరేవులో గజమాలతో హరీష్‌మాధుర్‌కు ఘన స్వాగతం



తండ్రి చిత్రపటానికి నమస్కరిస్తూ...

అభ్యర్థితో ఒకరోజు కార్యక్రమంలో భాగంగా
బాలయోగి తనయుడు హరీష్‌మాధుర్‌తో
'ఆంధ్రజ్యోతి' ప్రయాణం.... 5లో

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం. 4

పాఠకుని పూర్తి పేరు : ....
డోరు నెంబరు : .... వీధి పేరు : ....
గ్రామం/పట్టణం : .... మండలం : ....
జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది. మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. తుని				
2. జగ్గంపేట				
3. ప్రత్తిపాడు				
4. పెద్దాపురం				
5. పిఠాపురం				
6. కాకినాడ సిటీ				
7. కాకినాడ రూరల్				
8. అనపర్తి				
9. రాజానగరం				
10. రాజమండ్రి రూరల్				
11. రాజమండ్రి సిటీ				
12. రంపచోడవరం				
13. రామచంద్రపురం				
14. మండపేట				
15. కొత్తపేట				
16. పి. గన్నవరం				
17. రాజోలు				
18. అమలాపురం				
19. ముమ్మిడివరం				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : డోరు నెం. 114-2-485/2, దివాన్‌చెరువు టు వెలుగుబంద రోడ్, పాలచర్ల గ్రామ పంచాయితీ, రాజానగరం మండలం, రాజమండ్రి - 533102.

బంధం బలమెంత 5

డెల్టా కాలువలకు నీరు నిలిపివేత

నేడు పిఠాపురానికి సీఎం జగన్

నేడు పిఠాపురానికి రామ్‌చరణ్ 4



- రాష్ట్రంలో అరుదైన రాజకీయ నాయకుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- ఇప్పటివరకు 9సార్లు పోటీ చేసిన రికార్డు
- ఆరు సార్లు ఎమ్మెల్యేగా..
- ఇప్పుడు హ్యాట్రిక్ కొట్టేందుకు తహతహ

9 సార్లు పోటీ 6 సార్లు విజయం

బరిలో పదోసారి

ఆంధ్రప్రదేశ్‌లో అరుదైన రాజకీయ నాయకుల్లో గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఒకరు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్యనే ఉండే రాజకీయ నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన పదోసారి శాసన సభ ఎన్నికల బరిలోకి దిగారు. ఇప్పటి వరకూ 9 సార్లు పోటీ చేసి ఆరుసార్లు విజయకేతనం ఎగురవేసిన సీనియర్ నాయకుడు గోరంట్ల ఏడో సారి కూడా తనదే గెలుపంటున్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పదో సారి బరిలోకి దిగుతున్న బుచ్చయ్యచౌదరి తాను ఏడోసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టడం ఖాయమని ఘంటాపథంగా చెబుతున్నారు. రాజమహేంద్రవరం సిటీ నుంచి నాలుగుసార్లు, రాజమహేంద్రవరం రూరల్ నుంచి రెండో సారి గెలిచి, మళ్లీ రూరల్ నుంచి టీడీపీ కూటమి అభ్యర్థిగా దూసుకుపోతున్నారు. కమ్యూనిస్ట్ పార్టీ సానుభూతిపరుల కుటుంబం నుంచి వచ్చిన ఆయన రాజమహేంద్రవరంలో కమ్యూనిస్ట్ పార్టీల అనుబంధ విద్యార్థి సంఘాలలో క్రియాశీలకంగా వ్యవహరించారు. 1982లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించినపుడు, ఎన్టీఆర్ సమక్షంలో ఆయన పార్టీ తీర్థం తీసుకున్నారు. గోదావరి జిల్లాలో పార్టీ కన్వీనర్‌గా పార్టీని బలోపేతం చేసిన చరిత్ర ఆయనకు ఉంది. 1983, 1985, 1994, 1999లో రాజమండ్రి నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. అంతకు ముందు 1987 నుంచి ఆంధ్ర ప్రదేశ్ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా 1989 వరకు వ్యవహరించారు. 1989 నుంచి 91 వరకూ రాజమండ్రి, అమలాపురం, కాకినాడ పార్లమెంట్ స్థానాలకు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1994లో ఎన్టీఆర్ మంత్రివర్గంలో పౌర సరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. రాజమండ్రి సిటీ గెలిచి మంత్రి పదవి చేపట్టిన వారిలో గోరంట్ల రెండో వారు. మొదట ప్రజాపార్టీ నుంచి గెలిచిన డా. ఏబీ నాగేశ్వరరావు పురపాలక, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత గోరంట్ల బుచ్చయ్యచౌదరినే మంత్రిగా చేశారు తప్పిస్తే ఇంకెవరు రాజమహేంద్రవరం సిటీ నుంచి మంత్రి కాలేదు ఇప్పటివరకు. 1995లో ఎన్టీఆర్ తరపున నిలబడి, 1996లో రాజమహేంద్రవరం లోక్‌సభకు పోటీ చేసి ఓడిపోయారు. 1997లో చంద్రబాబు ఆహ్వానం మేరకు టీడీపీలోనే ఉన్నారు. 2014లో బీజేపీ పొత్తు వల్ల ఆయన రాజమండ్రి రూరల్ నుంచి పోటీ చేయాల్సి వచ్చింది. అప్పటి నుంచి ఆయనే అక్కడ గెలుస్తున్నారు. 2014, 2019లోనూ గెలిచారు. 2024లో కూడా ఆయనే పోటీ చేస్తున్నారు. ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తాననే ధీమాలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఉన్నారు.

వ్యూహ ప్రతివ్యూహాలు



ఉప్పలగుప్తం, మే 10 : అభ్యర్థుల ఎంపిక మొదలు పోలింగ్ రోజు వరకు వ్యూహకర్తలే ఎన్నికల ప్రక్రియను నడిపిస్తున్నారన్నది జగమెరిగిన సత్యం. దశల వారీగా రాజకీయపార్టీల వ్యూహకర్తలు ప్రత్యర్థి శిబిరాల్లో గందరగోళం సృష్టించేలా కుట్రలు చేయడం షరా మామూలే. ప్రచారం, పార్టీ మార్పిడులు, ఎన్నికల మేనిఫెస్టో వంటి అంశాలపై ఎప్పటికప్పుడు వక్రభాష్యాలు, ఫేక్ మెసేజ్‌ల అలజడి, ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాలు చేయడం ద్వారా ఓటర్లలో సందేహాల సృష్టికి శక్తి వంచన లేకుండా శ్రమిస్తుంటారు. అన్ని దశల్లోనూ పుకార్లను షికారు చేయించడం ద్వారా తమ వ్యూహ సాఫల్యతకు వ్యూహకర్తలు నానా తంటాలు పడుతుంటారు. అయితే ప్రచారపర్వం ముగింపు దశకు చేరుకోవడంతో చివరగా ఓటర్లపై పార్టీలు కుబేర అస్త్రాన్ని సంధించే యత్నాల్లో బిజీగా ఉన్నాయి. ఇక్కడ కూడా వ్యూహకర్తలు ప్రత్యర్థుల కుబేరాస్త్రం విఫలమయ్యేలా కుతంత్రాల మంత్రదండంతో ఓటర్లను ఇరుకునపెడుతున్నారు. ఉదాహరణకు ఒక పార్టీ అభ్యర్థి ఒక వీధిలో ఓటుకు వెయ్యి రూపాయలు పంచుతుంటే ప్రత్యర్థి పార్టీ వ్యూహకర్తలు పంపిణీ మొత్తాలపై పుకార్లు పుట్టిస్తున్నారు. ఫలానా గ్రామంలో ఓటుకు రెండు వేలు పంచుతున్న పార్టీ ఇక్కడ వెయ్యితో సరిపెడుతున్నారంటూ పుకార్లను షికారు చేయిస్తున్నారు. దీంతో కొందరు ఓటర్లు పంపిణీదారులను నిలదీస్తున్నారు. మీరు కొంత మినహాయించుకుని మాకు పంచుతున్నారంటూ ఆరోపణాస్త్రాలు సంధిస్తున్నారు. ఈ రకమైన గందరగోళంతో ప్రత్యర్థి పార్టీ ఇరుకున పడుతోంది. వాస్తవాలేమైనప్పటికీ కేవలం పుకార్లకే జనం ఓటేయడంతో పరిస్థితి సందిగ్ధంలో పడింది. గ్రామ, వార్డు స్థాయి నాయకులు ఓటర్లను నమ్మించడానికి నానా తిప్పలు పడుతున్నారు. దాదాపు అన్ని పార్టీల శిబిరాల్లోనూ ఈ పుకార్లు నాయకులకు తలనొప్పిగా పరిణమించాయి. జనరల్ నియోజకవర్గాల్లో అధిక మొత్తంలో జరుగుతున్న కాసుల పంపిణీని రిజర్వుడు నియోజకవర్గాల్లో ప్రచారం చేయడం ద్వారా వ్యూహకర్తలు ఓటర్లలో సందేహాలను రేకెత్తిస్తున్నారు. పార్టీ నిర్ణయం మేరకే పంపిణీ తప్ప మేము కేవలం నిమిత్తమాత్రులమంటూ స్థానిక నాయకులు ఓటర్లకు నచ్చచెప్పేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. చివరి దశలో ప్రత్యర్థి పార్టీల ఓట్లు దండుకోవడానికి వ్యూహకర్తల ప్రయత్నాలు ఫలిస్తాయా? బెడిసికొడతాయా అన్నది ఓటరు దేవుళ్లకే ఎరుక.



మునిగేదెవరు?

అధికార వైసీపీపై గుర్రుగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు

ప్రచారాస్త్రంగా 'అన్యాయం'..తలరాతను నిర్దేశించే తీర్పుకు రెడీ



నిర్వాసితులకు మొండి చెయ్యి

(రంపచోడవరం):

రంపచోడవరం గిరిజన నియోజకవర్గంలో ఐదు మండలాల్లోని పోలవరం నిర్వాసితులే ఇక్కడి అభ్యర్థుల తలరాతను నిర్దేశించనున్నారు. పోలవరం ప్రాజెక్టు, తద్వారా గోదావరి తీరంలోని ఐదు మండలాలకు ఒనగూరే దుష్ప్రయోజనాలు, పునరావాస అంశాలే ఈ ఎన్నికల్లో ప్రచారాస్త్రాలుగా మారాయి. ముఖ్యంగా గత 59 నెలలుగా వైసీపీ ప్రభుత్వంలో ఎదురైన చేదు అనుభవాలు నిర్వాసిత ఓటర్లను ప్రతికూలంగా మార్చాయి. పోలవరం నిర్వాసితులకు టీడీపీ అన్యాయం చేసిందంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ తర్వాత పునరావాసాన్ని గాలికి వదిలేసింది. వాస్తవానికి గోదావరిలో సగానికిపైగా ఖాళీగా వదిలేసిన కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి, ఎత్తు పెంచేసిన పాపం వైసీపీ ప్రభుత్వానిదే! ఫలితంగా తదనంతర వరదలకు కారణమై మునుపెన్నడూ లేని ముంపును విలీన మండలాలకు వైసీపీ తెచ్చిపెట్టింది.

వైసీపీని నమ్మిన నిర్వాసితులకు జగన్ మొండి చేయి చూపారు. పోలవరం రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసే ఆరు నెలల ముందే నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పునరావాసాన్ని కల్పించాలన్న నిబంధనను ఉల్లంఘించి నిర్వాసితులను ముంచేసింది. దేవీపట్నం మండలంలో ముంపు గ్రామాలన్నిటినీ పూర్తి స్థాయి పునరావాసం కల్పించకుండానే బలవంతంగా తరలించేశారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం పునరావాసం పూర్తి చేయకుండా నిర్వాసితులను ఖాళీ చేయవద్దంటూ ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో ఇచ్చిన ఉత్తర్వులను బేఖాతరు చేసి నిర్వాసితులను ఖాళీ చేయించింది.

పునరావాస ప్రగతి శూన్యం

విలీన మండలాలకు అన్యాయం

విలీన మండలాల్లో పునరావాస చర్యల్లో ప్రగతి శూన్యమే. వైసీపీ పాలనలో పోలవరం చేపట్టాక వచ్చిన మూడు గోదావరి వరదల్లో ఊహించని ముంపును ఎదుర్కొని గ్రామాలను కట్టుబట్టలతో ఖాళీ చేసి వెళ్లిపోయిన చేదు అనుభవం గోదావరి ప్రభావిత గిరిజన గ్రామాలను వెంటాడుతోంది. ఫలితంగా వైసీపీ ప్రభుత్వం మూలంగా నష్టాన్ని చవిచూసిన చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాలు, దేవీపట్నం మండలంలోని పోలవరం ప్రభావిత ఓటర్లు వ్యవహరించే తీరే ఇక్కడి అభ్యర్థుల తలరాతలను మార్చేసేలా ఉంది. మొత్తం సుమారు 2.77 లక్షల ఓటర్లలో సుమారు ఒక లక్ష మంది పోలవరం ప్రభావిత ఓటర్లే! ఇందులో మెజారిటీ ఓట్లు ఎటు మళ్లుతాయో అటే విజయావకాశాలు ఉండటంతో అధికార వైసీపీ ఆందోళనలో పడింది. తాము నిర్వాసితులకు అండగానే ఉన్నా మని, పునరావాసం కల్పించాకనే నిర్వాసితుల తరలింపు ఉంటుందని తమకే మళ్లీ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. టీడీపీ అయితే నిర్వాసితులకు అన్యాయం చేసింది జగన్ ప్రభుత్వమేనని, తమ పార్టీ అధికారంలో ఉండగా నిర్వాసితులకు జరిగిన అన్యాయం ఏదీ లేదని, నిర్వాసితుల బలవంతపు తరలింపు తాము చేయలేదని తమకే అవకాశం ఇవ్వాలని కోరుతోంది. అసలు నిర్వాసితులకు అన్యాయం చేసింది ఈ రెండు పార్టీలేనని, ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పి తమకు అవకాశం ఇవ్వాలంటూ సీపీఎం ఇంటింటా ప్రచారం సాగిస్తోంది. అయితే వైసీపీ వ్యతిరేక ఓటుతో పాటు నిర్వాసితుల ఓట్లపైనే సీపీఎం ఎక్కువ ఆశపెట్టుకుంది. దీంతో సీపీఎం ఎవరి ఓట్లను చీల్చుతుందో, నిర్వాసితులు ఎవరివైపు నిలిచి, ఎవరిని ముంచుతారో అన్న చర్చ సాగుతోంది.


ఎన్నికల సిబ్బంది మెనూ

ప్రకటించిన ఎన్నికల సంఘం



పెద్దాపురం, మే 10 : ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ విధులకు నియమించిన సిబ్బందికి ఈనెల 12, 13 తేదీల్లో ఇవ్వాల్సిన మెనూను ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. 12వ తేదీ సాయంత్రానికి ఎన్నికల సామగ్రితో సిబ్బందికి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు రాగానే వారికి బొండాలు, గారెలు అల్పాహారం మజ్జిగ లేదా టీ ఇవ్వాలి. రాత్రి 7.30 గంటలకు చపాతీ/రోటీ, అన్నం, ఆకుకూర పప్పు, రోటీ పచ్చడి, టమాటా, ఆలుకూర, రసం, పెరుగు వడియాలు, అరటి పండు ఇవ్వాలి. పోలింగ్ రోజైన 13వ తేదీ ఉదయం 4.30 గంటలకు టీ, ఐదు గంటలకు వేడి ఇడ్లీ, గారె, రెండు చట్నీలు ఇవ్వాలి. 9 గంటలకు ఫ్రూట్స్, మజ్జిగ లేదా కొబ్బరి నీళ్లు, 11 గంటలకు ప్లమ్ కేక్, టీ.. 12.30 గంటలకు విజిటబుల్ బిర్యానీ, పెరుగు అన్నం, నిమ్మబద్ద మూడు గంటలకు ఉస్మానియా బిస్కెట్లు, టీ లేదా ఫ్రూట్స్ సలాడ్, ఆరు గంటలకు బొండా, గారి చట్నీ, టీ, మజ్జిగ ఇస్తారు. ఇవన్నీ స్థానికంగా తయారు చేయించి ఫ్రెష్‌గా సరిపడేలా తయారుచేసి వడ్డించాలి. ఒక్కొక్క పోలింగ్ స్టేషన్ పరిధిలో 15 మంది సిబ్బంది మెనూ ప్రకారం భోజనం అల్పాహారం అందించాలి.


బీప్ శబ్దం వస్తేనే..



ఆత్రేయపురం, మే 10: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగే పోలింగ్‌లో ఓటు వేసేటప్పుడు ఓటర్లు జాగ్రత్తలు తీసుకోవాలి. పోలింగ్ కేంద్రంలో ఈవీఎం బటన్ నొక్కినప్పుడు... బీప్ అనే వచ్చే శబ్దం గమనించాలి. అలా శబ్దం రాకుంటే ఓటు దుర్వినియోగం అయినట్టు భావించాల్సి వస్తుంది. అందుకే ఓటు వేసే ప్రతి ఒక్క ఓటరు దృష్టి కేంద్రీకరించాలి. పోలింగ్ కేంద్రంలో ఉండే ముగ్గురు అధికారుల్లో మొదటి అధికారి మన వివరాలు పరిశీలించి ఒక స్లిప్ ఇస్తారు. రెండో అధికారి ఓటరు నుంచి సంతకం తీసుకుంటారు. మూడో అధికారి చేతి వేలికి ఇంకు మార్కు వేస్తారు. ఈ అధికారి వద్దే ఈవీఎం మాస్టర్ కంట్రోల్ యూనిట్ ఉంటుంది. అది నొక్కినప్పుడు మాత్రమే ఈవీఎం యాక్టివేట్ అవుతుంది. ఈవీఎంలో పార్టీ అభ్యర్థి పేరు, వివరాలు కనిపిస్తాయి. అప్పుడు ఓటరు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయవచ్చు. బటన్ నొక్కినప్పుడు శబ్దం రాకపోతే ఓటు పడలేదని అర్థం. వృద్ధులు, కొత్త ఓటర్లు ఓటు దుర్వినియోగం కాకుండా కాపాడుకోవాలి.


నేడు పిఠాపురానికి

మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్



పిఠాపురం, మే 10: మెగా హీరో రామ్‌చరణ్ శనివారం పిఠాపురం రానున్నారు. తన తల్లి సురేఖతో కలిసి హైదరాబాద్ నుంచి పిఠాపురం రానున్న ఆయన ఉదయం 9.30 గంటలకు పాదగయ క్షేత్రాన్ని సందర్శించుకోనున్నారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతయిన పురుహూతికాఅమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని సందర్శించి పూజలు చేస్తారు. పూజలు తర్వాత జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కలుస్తారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఇందుకు సంబంధించి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మేం ఓట్లు అమ్ముకోం..



గొల్లప్రోలు, మే 10: 'ఈ ఇంటిలో ఓట్లకు నోటు తీసుకొనబడవు' అంటూ రాసిన కాగితం గొల్లప్రోలులో ఓ ఇంటి వద్ద దర్శనమిచ్చింది. తాటిపర్తి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గెడ్డమూరి శివ శ్రీనివాసరావు గొల్లప్రోలు పట్టణంలోని దేవీనగర్‌లో నివాసముంటున్నారు. ఓటుకు నోటు ఇస్తూ రాజకీయ పక్షాలు ప్రలోభాలకు గురిచేస్తున్న నేపథ్యంలో ఆయన ముందే మేలుకొన్నారు. ఇంటిలో ఉన్న తనతో పాటు తన భార్య ఓటును అమ్ముకోకూడదని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు తమ ఓటరు నెంబర్లు ఉదహరిస్తూ ఈ ఇంటిలో ఓట్లుకు నోటు తీసుకోమని, దయచేసి ఎవ్వరు ఓటుకు నోటు ఇవ్వడానికి ప్రయత్నించకండి అని చెబుతూ నోటీసులు అంటించారు. ఇది గొల్లప్రోలు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

జనసేన సెగ

కొత్తపల్లి, మే 10: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ పిఠాపురం ఎమ్మెల్యే వంగా గీతావిశ్వనాథ్‌కు జనసైనికుల సెగ తగిలింది. శుక్రవారం వైసీపీ అభ్యర్థి కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం చేపట్టేందుకు ఉప్పాడ నుంచి కొత్తపల్లి బయలుదేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి గీత వాహనంలో కొత్తపల్లి పాత రెవెన్యూ కార్యాలయం మీదుగా ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. ఈ లోగా పాత రెవెన్యూ కార్యాలయం వద్ద జనసేన పార్టీ కార్యాలయం వద్ద జనాలను చూసిన ఆమె ఆగే ప్రయత్నం చేసేలోగా అక్కడ ఉన్న వారంతా జై జనసేన, జై పవన్‌కల్యాణ్ అంటూ నినా అక్కడ ఆగకుండా కాలనీకి వెళ్లారు. తర్వాత కాలనీలోకి వెళ్లి ఓట్లు అభ్యర్థించేందుకు ఇంటింటికీ వెళ్లగా మహిళలు ఎవరూ బయటకు రాకపోవడంతో ఆమె వెనుదిరిగారు. అక్కడ నుంచి వాకతిప్ప చేరుకొని ప్రచారాన్ని కొనసాగించారు.

వైసీపీ నాయకులు

నొక్కేస్తున్నారు!

కొత్తపల్లి, మే 10: అధికార వైసీపీ పంపిణీ చేసే నగదులో పలువురు నాయకులు చేతివాటం ప్రదర్శించడంతో గ్రామాల్లో ప్రజలు నాయకుల తీరుపై గుర్రుగా ఉన్నారు. ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులు ఓట్ల కోసం ప్రజలకు ఇచ్చే నగదులో కూడా కోత పెట్టడంతో ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో ఓటర్లకు ఇచ్చే డబ్బులు పంపిణీ చేసే వ్యక్తులు తమ జేబుల్లో నుంచి ఇచ్చినట్టుగా కోత పెడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. ఒక్కొక్క ఓటుకు రూ.3000 ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.1500 ఇస్తున్నారని, అసలు ఇవ్వకపోయినా బాగుండేదని ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామాల్లో ఓటర్లు అనుకొంటున్నారు. డబ్బులు తీసుకొని మనం చేసేది చేద్దామని గ్రామాల్లో ప్రజలు ఆంతరంగికంగా చర్చించుకోవడం గమనార్హం.

వాళ్లు జనసేనకు ఓటేస్తారు..!

డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు..

పిఠాపురం/గొల్లప్రోలు, మే 10: పిఠాపురం నియోజకవర్గంలో అధికార వైసీపీ ప్రలోభాలకు తెరలేపింది. భారీగా ఓట్లు కొనుగోలు చేసేందుకు చిత్తూరు, కడప జిల్లాలకు చెందిన నేతలు రంగంలోకి దిగారు. వారి కనుసన్నల్లో గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాలతో పాటు పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల్లో ఓట్లు కొనుగోలుకు భారీగా నగదును తీసుకువచ్చారు. ఓటుకు రూ.3 వేలు వంతున నగదు పంపిణీ చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో చీరలు పంపిణీ చేశారు. అయితే పంపిణీలో వైసీపీ నేతలు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారింది. జనసేనకు ఓటు వేస్తారు అని అనుమానం ఉన్న వారికి డబ్బులు ఇవ్వడం లేదు. వారు గాజుగ్లాసుకు ఓటు వేస్తారు వారికి డబ్బులు ఇవ్వక్కర్లేదని బహిరంగంగానే వైసీపీ నేతలు చెబుతున్నారు. దీనిపై గొల్లప్రోలు పట్టణంతో పాటు పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో పలుచోట్ల వివాదాలు జరిగాయి. తమకు ఎందుకు డబ్బులు ఇవ్వరని ప్రజలు నిలదీస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల చోటా మోటా వైసీపీ నేతలు సమాధానం చెప్పలేక జారుకుంటున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

నేడు పిఠాపురానికి జగన్

ప్రజలకు కష్టాలు ప్రారంభం

- జగన్ వచ్చే మార్గంలో షాపులు మూసివేయాలని హుకుం
- ఇప్పటికే చెట్ల నరికివేత.. జనసమీకరణకు నేతల పాట్లు
- వైసీపీ నాయకుల మధ్య సమన్వయ లోపం
- జనసమీకరణ బాధ్యత నుంచి తప్పుకుంటున్న వైనం



ఏర్పాట్ల పరిశీలనలో అధికారులు




హెలిపాడ్

పిఠాపురం, మే 10: పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో శనివారం మధ్యాహ్నం జరిగే వైసీపీ ఎన్నికల ప్రచార సభలో సీఎం జగన్ పాల్గొననున్నారు. సీఎం రానుండటంతో పట్టణ ప్రజలకు కష్టాలు అప్పుడే ప్రారంభమయ్యాయి. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో కాంక్రీటుతో హెలిపాడ్ నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. ఇప్పటికే దీనిపై క్రీడాభిమానులు నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ హెలిపాడ్ దిగి ఉప్పాడ సెంటర్ వరకూ సీఎం బస్సులో వెళ్లనున్నారు. ఈ మార్గంలో ఉన్న షాపులన్నింటిని శనివారం ఉదయం నుంచే మూసివేయాలని పోలీసులు హుకుం జారీ చేశారు. పట్టణంలోని ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. పట్టణంలోకి వచ్చే వాహనాలు అన్నింటిని బైపాస్‌రోడ్డు మీదుగా మళ్లిస్తామని పోలీసులు తెలిపారు. మరోవైపు సీఎం సభకు జనసమీకరణ కోసం వైసీపీ నేతలు పాట్లు పడుతున్నారు. శుక్రవారం సాయంత్రం వరకూ జనసమీకరణ బాధ్యతలు ఎవరు తీసుకోవాలనే అంశంపై తర్జనభర్జనలు పడ్డారు. బాధ్యత మీదంటే మీదని ఒకరిపై ఒకరు నెపం వేసుకున్నారు. అందరు వచ్చి హడావుడి చేసే వారే తప్ప పనిచేసే వారు లేరని పలువురు పట్టణ, మండలస్థాయి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు కడప, చిత్తూరు జిల్లాలు నుంచి వచ్చిన నేతలు జనసమీకరణపై సమీక్ష చేపట్టారు. తీసుకువచ్చిన ప్రతి ఒక్కరికి రూ. 300 ఇస్తామని ఆటో ఖర్చులు ఇస్తామని సదరు నేతలు, గ్రామ, మండల, పట్టణ, వార్డు స్థాయి నాయకులతో చెప్పారు. ఇప్పుడికి ఇప్పుడు చెబితే ఎలా అని పలువురు ప్రశ్నించారు. కాగా సీఎం జగన్ ప్రచార సభ బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు.

డెల్టా కాలువల కట్టివేత

ధవళేశ్వరం, మే10: డెల్టా కాలువలకు నీటి నిల్వలు నిలిపివేసి కాల్వలు కట్టివేశారు. శుక్రవారం సాయంత్రం తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువలకు నీటిని విడుదల చేసే హెడ్ స్లూయిజ్ గేట్లను పూర్తిగా దించేసి కాల్వలకు నీటి విడుదల నిలిపివేశారు. ఖరీఫ్ చివరి ఆయకట్టు వరకు నీరు పారే విధంగా కాల్వల్లో పూడికతీత పనులు, లాకులు, తూముల షెట్టర్ల రిపేర్లు, వంటి పనులు నిర్వహించి జూన్ మొదటివారం నాటికి నీటిని విడుదల చేయడానికి కాల్వలు సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు.



మద్యం కేసులు స్వాధీనం



పిఠాపురం రూరల్, మే 10: పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. గ్రామంలోని వనుం సత్యనారాయణ ఇంటిలో ఉంచిన 77 కేసుల మద్యం బాటిళ్లను (3,234 మద్యం సీసాలు) స్వాధీనం చేసుకున్నారు. వీటిని స్వాధీనం చేసుకోవడంలో పోలీసులు, అధికారులు తీవ్ర జాప్యం చేయడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు, ఇది వైసీపీ నేతలకు చెందిన మద్యం కావడంతో అధికారులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎట్టకేలకు పోలీసులు సదరు తాళాలు తొలగించి మద్యం సీసాలను సీజ్ చేశారు. వీటిని వైసీపీ నాయకులు నిల్వ చేసినట్లు చెబుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో వీటిని ఉంచినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

గోదావరి జిల్లాల్లో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అంశాలు ప్రధానంగా ఏమై ఉంటాయన్న దిశగా చర్చ నడుస్తోంది. సామాజిక బలాలు, మహిళల ఓటింగ్, కీలకమైన యువత ఓటింగ్... ఈ సందర్భంలో చర్చనీయాంశమయ్యాయి. కాసేపు అభివృద్ధి, సంక్షేమం తదితర వాగ్దానాలను పక్కనబెడితే.. ఏ వర్గాల ఓట్లు ఎవరికి అనుకూలంగా మారతాయన్నది ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ విషయంలో వైసీపీతో పోల్చినా .. 'కూటమి' పైచేయిగా ఉందనే చెప్పాలి. టీడీపీ, జనసేన, బీజేపీ కలయిక.. మెజారిటీ ఓటింగ్ శాతాన్ని సాధించే విధంగా ఉందని విశ్లేషకులు సైతం చెబుతున్నారు. తెలుగుదేశం, జనసేన కలసి పోటీచేస్తుండడంతోపాటు బీజేపీ సంప్రదాయ ఓటింగ్ అదనంగా కలిసొచ్చే అంశం. అంతేగాకుండా ఈసారి సామాజిక సమీకరణాల్లో పెనుమార్పులు కనిపిస్తుండడం, యువత, ఉద్యోగుల ఓటింగ్ ఎటువైపో ఇప్పటికే కొంత స్పష్టత ఉండడం 'కూటమి' విజయావకాశాలపై అంచనాలను పెంచేసింది. కూటమి పార్టీల మధ్య వైసీపీ ఊహించినట్టుగా సమన్వయలోపం రాకపోగా, అద్భుతమైన ఐక్యతా రాగంతో కదనరంగంలో దూసుకెళ్లడం మరో విశేషం.

'బంధం' బలమెంత?

- గోదావరి తీరంలో ఐక్యతా రాగం
- వైసీపీకి వణుకుపుట్టిస్తున్న 'కూటమి'
- ఓట్ల బదిలీకి పట్టుబిగించిన నేతలు
- సామాజిక సమీకరణాల్లోనూ మార్పులు
- 'కీలక' ఓటింగ్ వర్గాలపై ప్రభావితం
- ఒకే మాట.. ఒకే లక్ష్యంతో ముందుకు సాగిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి మంచి జోష్ మీద ఉంది. మిత్రబంధం బలంగా.. ముందుకు పయనిస్తోంది. అందరిదీ ఒకటే మాట. ప్రజాకంటక పాలనపోవాలి. వైసీపీని సాగనంపాలి. అదే లక్ష్యం. ఇదే ఆలోచనతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రజావ్యతిరేక ఓట్లు చీలకూడదంటూ 'కూటమి'కి రాజమహేంద్రవరంలోనే బీజం వేశారు. అక్రమకేసుల్లో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని ములాఖత్ అయిన తర్వాత తెలుగుదేశం-జనసేన పొత్తు విషయం ప్రకటించారు. ఈ బంధానికి బీజేపీ కూడా త్రివేణీ సంగమంలా కలవడంతో అది మరింత బలపడింది. ప్రస్తుత ఎన్నికల్లో 'కూటమి'గా కలసి ప్రత్యర్థి వైసీపీపై తలపడుతోంది. సీట్ల పంపకం తర్వాత ఉమ్మడి తూర్పుగోదావరిలోని కాకినాడ, అమలాపురం, రాజమండ్రి పార్లమెంటు పరిధిలో రాజమండ్రిలో బీజేపీ, కాకినాడలో జనసేన, అమలాపురంలో టీడీపీ పోటీచేస్తున్నాయి. అసెంబ్లీల విషయానికొస్తే మూడు పార్లమెంటు స్థానాల్లో 21 స్థానాలకుగాను జనసేన 6 స్థానాల్లోను, బీజేపీ 1 స్థానంలోను, టీడీపీ 14 స్థానాల్లో టీడీపీ పోటీ చేస్తున్నాయి. వాస్తవానికి ఆయా చోట్ల సీట్ల పంపకంలో కొంత గందరగోళం, ఆందోళనలు నెలకొన్నాయి. దాంతో ఆయా పార్టీల మధ్య ఐక్యత లోపించి కుమ్ములాటలు తప్పవని అధికార వైసీపీ కలలు కంది. కానీ ఒకే లక్ష్యంతో ఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నేతలు, శ్రేణులు ఐక్యమయ్యాయి. కిందిస్థాయి కార్యకర్తను అడిగినా, అభ్యర్థిని ప్రశ్నించినా, పొత్తుల వల్ల టిక్కెట్లను త్యాగం చేసిన నేతలను అడిగినా ఒకటే మాట. దుర్మార్గ పాలకుడు జగన్ పోవాలి. వైసీపీ అంతమవ్వాలి. నష్టపోయిన రాష్ట్రాన్ని, నష్టపోయిన ప్రజలను కాపాడడం కోసం కూటమి గెలవాలి. ఇదే అంశాన్ని జనంలోకి తీసుకెళ్లడంలో కూటమి నేతలు విజయం సాధించారు. అభ్యర్థి, ఆ నియోజకవర్గంలో మిత్రపక్ష నేతల మధ్య సమన్వయం కూడా బాగుండడంతో కేడర్ ఒకేతాటిపైకి రావడానికి పెద్దగా సమయం పట్టలేదు. ఇప్పుడు ఊరూరా కూటమి పక్షాల కేడర్ అంతా కలసి ముందుకు సాగుతున్న దృశ్యాలే అన్నిచోట్లా కనిపిస్తున్నాయి. ఇదే ఇప్పుడు వైసీపీ అభ్యర్థుల్లో, ఆ పార్టీ నేతల్లో వణుకు పుట్టిస్తోంది. గోదావరి జిల్లాలో తీర్పు ఎప్పుడూ 'సునామీ'లా వ్యక్తమవుతుండడంతో ప్రత్యర్థుల గుండెల్లో గుబులురేపుతోంది. 2019 ఎన్నికల నాటికి ఇప్పటికి ఉన్న మార్పులను చాలామంది విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా టీడీపీ, జనసేన కలిసిపోవడం, బీజేపీ సంప్రదాయ ఓటింగ్ కూడా ఈసారి కీలకంగానే ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేగాకుండా సామాజిక వర్గాల ఓట్ల బదిలీ పెను సంచలనాలకు దారితీస్తుందేమోనన్న అంచనాలు కూడా దడ పుట్టిస్తున్నాయి. గోదావరి జిల్లాల్లో మెజారిటీ వర్గాల్లో 'ముఖ్య'మైన ఓటింగ్ ఒకే తాటిపైకి వస్తుండడం వైసీపీ నేతల్లో కలవరం కలిగిస్తోందని పలువురు చెబుతున్నారు. మహిళలు, యువతరం ఓటింగ్ కూడా ఎటువైపు ఉందనే విషయంలో ఎవరి అంచనాలు వారికి ఉన్నాయి. మహిళలు టీడీపీ పథకాలకు ఆకర్షితులు కావడం, యువతను ఎక్కువగా పవన్‌కల్యాణ్ ప్రభావితం చేయడం కూడా ఓటింగ్ సరళిని మార్చివేసే అవకాశం ఉందని మరో విశ్లేషణ సాగుతోంది. మొత్తానికి కలసికట్టుగా ఎన్నికల బరిలో దిగడం 'కూటమి'కి లాభమేనని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయంగా ఉంది. అదే దిశగా ఊరూరా కూటమి శ్రేణులు ఎన్నికల బరిలో దూసుకెళుతున్నాయి.

రాజమండ్రి పార్లమెంటు పరిధిలో..

రాజమండ్రి లోక్‌సభ కూటమి బీజేపీ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరి 'కూటమి' సహకారంతో ఎన్నికల బరిలో దూసుకుపోతున్నారు. ఎన్టీఆర్ కుమార్తె కావడం వల్ల ఆమెను సొంత ఆడపడుచులా అన్ని నియోజకవర్గాల్లో ఆదరిస్తున్నారు. ఆమె విజయానికి కూటమి తరపున టీడీపీ నేతలు గన్ని కృష్ణ, బొడ్డు వెంకటరమణ వంటివారు పనిచేస్తున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని జనసేన కేడర్, టీడీపీ కేడర్ కలసి పనిచేస్తున్నారు. ఇక రాజమండ్రి సిటీ కూటమి టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసుకు మద్దతుగా సిటీ జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేస్తున్నారు. మరో నాయకుడు వై.శ్రీనివాస్ కూడా అదే రీతిలో పనిచేస్తున్నారు. రూరల్ కూటమి టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి విజయానికి జనసేన కేడర్ అంతా పనిచేస్తోంది. రూరల్ జనసేన ఇన్‌చార్జి కందుల దుర్గేష్ నిడదవోలు నుంచి పోటీచేస్తుండడంతో ఆయన సూచనలతో జనసేన కేడర్ పూర్తిస్థాయిలో రంగంలోకి దిగింది. బీజేపీ శ్రేణులు కూడా గోరంట్ల గెలుపు కోసం పాటుపడుతున్నాయి. రాజానగరం కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణకు అండగా టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, టీడీపీ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ వర్గం, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర వంటివారు సైతం నిలిచారు. అనపర్తి కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయంకోసం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ నేత కృష్ణంరాజుతోపాటు కేడర్ అంతా ఒకటే లక్ష్యంగా పనిచేస్తున్నారు. గోపాలపురం కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు విజయానికి మాజీ జడ్పీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత ముళ్లపూడి బాపిరాజుతోపాటు జనసేన ఇన్‌చార్జి డి. సువర్ణరాజు కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేస్తున్నారు. నిడదవోలు కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ విజయం కోసం టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ఆ పార్టీ శ్రేణులు బాగా పనిచేస్తున్నాయి. కొవ్వూరు కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు విజయానికి అక్కడ కింగ్‌మేకర్‌గా ఉన్న అచ్చిబాబు అన్నీ తానై పనిచేస్తున్నారు. జనసేన ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రామారావుకు వేరేచోట బాధ్యతలు అప్పగించినా వీలైనప్పుడల్లా ఇక్కడ పనిచేస్తున్నారు. ఇక్కడ జనసేన, బీజేపీ కేడర్ కూడా గెలుపుకోసం కృషి చేస్తున్నాయి.

ఒకటే అజెండా.. అరాచక పాలనకు చరమగీతం పాడాలి...

అమలాపురం టౌన్/ ముమ్మిడివరం/ద్రాక్షారామ/కొత్తపేట/పి గన్నవరం/మండపేట మే 10: గెలుపే కూటమి లక్ష్యం. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ అభ్యర్థి విజయానికి రేయింబవళ్లు కృషి చేస్తున్నారని అమలాపురం కూటమి టీడీపీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అరాచక పాలనకు చరమగీతం పాడించేందుకు అంతా ఒక్కటై పనిచేస్తున్నామన్నారు. అమలాపురం జనసేన నాయకుడు నల్లా శ్రీధర్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలన్న పవన్‌కల్యాణ్ మాటలే శిరోధార్యంగా జనసైనికులంతా పనిచేస్తున్నారని చెప్పారు. బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు మాట్లాడుతూ కూటమి అభ్యర్థి ఆనందరావు విజయం తథ్యమని, సమన్వయంతో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పనిచేస్తున్నారని చెప్పారు. ఇక ముమ్మిడివరం నియోజకవర్గానికి వస్తే జనసేన ఓటు బ్యాంకు తమకు పూర్తిగా కలసి వస్తుందని కూటమి టీడీపీ అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తన విజయానికి మనస్ఫూర్తిగా పనిచేస్తున్నారన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొలకోటి వెంకటరెడ్డి మాట్లాడుతూ మూడు పార్టీలు కలిసి అభ్యర్థి విజయానికి కృషి చేస్తున్నామని చెప్పారు. రామచంద్రపురంలో టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ విజయానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దూడల శంకరనారాయణ తదితరులు శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారు. జనసేన ఓటు బ్యాంకు, బీజేపీ సంప్రదాయ ఓటింగ్ ఇక్కడ టీడీపీకి కలిసివచ్చే అంశంగా మారింది. కొత్తపేటలో తన విజయానికి టీడీపీతో పాటు జనసేన, బీజేపీలు కలికగట్టుగా పనిచేస్తున్నాయని కూటమి టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావు చెప్పారు. ఆయన సోదరుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాలే తమకు శిరోధార్యమని, ఆయన నిర్ణయానికి కట్టుబడి కూటమి విజయానికి కృషిచేస్తున్నామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం మాట్లాడుతూ టీడీపీ, జనసేనతో కలిసి పార్టీ ఆదేశానుసారం కూటమి విజయానికి బీజేపీ తరుపున ఐక్యతతో విజయానికి కృషిచేస్తున్నామన్నారు. జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ పోటీచేస్తున్న పి.గన్నవరం నియోజకవర్గంలో తమ టీడీపీ శ్రేణులన్నీ అహర్నిశలూ పనిచేస్తున్నాయని నియోజకవర్గ టీడీపీ కో-కన్వీనర్ నామన రాంబాబు చెప్పారు. పి.గన్నవరం కూటమి అసెంబ్లీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ తన గెలుపు కోసం అహర్నిశలూ కృషిచేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. మండపేటలో కూటమి టీడీపీ అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీతోపాటు జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తల సహకారం మరువలేనిదన్నారు. జనసేన మండపేట ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ మాట్లాడుతూ నాల్గవసారి కూటమి టీడీపీ అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు విజయం ఖాయమని చెప్పారు. కూటమి కలయికతో ఓట్ల బదిలీ జరుగుతుందని, ఆ దిశగా తమ పార్టీ శ్రేణులన్నీ పనిచేస్తున్నాయని చెప్పారు. జనసేనాని పవన్ ఇచ్చిన పిలుపు మేరకు వైసీపీ ఓటమే లక్ష్యంగా, వేగుళ్ల గెలుపే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. బీజేపీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కోటిపల్లి సాయిరాం మాట్లాడుతూ సిట్టింగ్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు విజయం కోసం బీజేపీ శ్రేణులన్నీ పనిచేస్తున్నాయని చెప్పారు.

మేము సైతం రాష్ట్రం కోసం...

ప్రొఫెషనల్స్ వింగ్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ





మేము సైతం సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మెట్ల రమణబాబు, టీడీపీ నాయకులు, (పైన) సాకుర్రులో టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి ఆనందరావు (కుడి)

అమలాపురం టౌన్, మే 10: యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలంటే కూటమి అభ్యర్థులనే గెలిపించాలంటూ తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ చేపట్టారు. వింగ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కడలి దేవిప్రసాద్, భాస్కర్ల రవితేజ ఆధ్వర్యంలో మేము సైతం రాష్ట్రం కోసం అంటూ అమలాపురం గడియార స్తంభం సెంటరు వద్ద సైకిల్ ర్యాలీని జోన్-2 అధ్యక్షుడు మంతెన సీతారామరాజు శుక్రవారం ప్రారంభించగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు సంఘీభావం తెలిపారు. నాయకులు దెందుకూరి సత్తిబాబురాజు, తిక్కిరెడ్డి నేతాజీ, భాస్కర్ల రామకృష్ణ, మీడియా కో-ఆర్డినేటర్ బోళ్ల సతీష్, పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు బోళ్ల వెంకటరమణ, దాట్ల రవివర్మ పాల్గొన్నారు. జాబు రావాలంటే బాబు రావాలి... ఓట్ ఫర్ సీబీఎన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, అసెంబ్లీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావులకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ర్యాలీలో టీడీపీ సీనియర్ నాయకులు అల్లాడ స్వామినాయుడు, చిక్కాల గణేష్, బత్తుల ప్రసాద్, ఆశెట్టి ఆదిబాబు, దున్నాల దుర్గ, మెట్ల సత్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. సాకుర్రు గ్రామానికి చెందిన శెట్టిబలిజ సంఘీయులు అధిక సంఖ్యలో టీడీపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు పొలమూరి ధర్మపాల్, చొల్లంగి సత్యసాయిబాబా, ముత్తాబత్తుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే యువత కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి చెరుకూరి సాయిరామ్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆనందరావుతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. ఇసుకపట్ల రఘుబాబు, దంగేటి బాబులు, పలచోళ్ల పద్మనాభం, సుంకర చిన్నబ్బాయి, కారుపర్తి గంగాధరం, పాటి రామయ్య, కొప్పాడి రామకృష్ణ, మాకిరెడ్డి మనోజ్, కడలి సాయి, పెంటపాటి సౌజన్య, బొమ్మిడి సిద్దు, పలివెల కేశవశ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థితో.. ఒకరోజు





హరీష్‌మాధుర్ విజయం కోరుతూ క్రైస్తవుల ప్రార్థన, బ్లాక్ కాఫీ తాగుతూ అంతరంగిక చర్చలు

నియంత పాలనకు చరమగీతం పాడేందుకు

ప్రజలు సంసిద్ధం

- ప్రజలకు అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే
- ఉదయం 9 నుంచి అర్ధరాత్రి వరకు అలుపెరుగని ప్రచారం
- అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌తో ఒక రోజు

జగన్ మాఫియా సామ్రాజ్యం తాడేపల్లి నుంచి అమలాపురం వరకు విస్తరించింది. ఇసుక, మట్టి, గంజాయి మాఫియాలను తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైంది అంటున్నారు అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ అన్నారు. శుక్రవారం హరీష్‌తో 'ఆంధ్రజ్యోతి' ఒకరోజు ప్రయాణం సాగించింది. ఉదయం లేచింది మొదలు అర్ధరాత్రి వరకు ప్రచారం సాగించడంతోపాటు వ్యూహ రచనలో తలమునకలయ్యారు. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల ముఖ్యులతో మాట్లాడుతూనే అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం చేశారు.

● అమలాపురం టౌన్

బిజీ షెడ్యూల్

హరీష్‌మాధుర్ ఉదయం ఆరు గంటలకే నిద్ర లేచారు. అప్పటికే వివిధ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు ఆయన ఇంటికి చేరుకున్నారు. దాంతో హడావుడిగా కాలకృత్యాలు తీర్చుకుని ఏడు గంటలకు టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. తొలుత తండ్రి, లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి చిత్రపటానికి నమస్కరించి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఉదయం అల్పాహారం తీసుకునే అలవాటు లేని హరీష్ బ్లాక్ కాఫీ తాగుతూనే 8.30 గంటల వరకు ముఖ్య నాయకులతో 13న జరిగే పోలింగ్ నిర్వహణపై చర్చించారు. 9 గంటల వరకు నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు.



పల్లంకుర్రులో పెరుగన్నం తింటూ...

రోడ్ షోలు... ముఖ్య నాయకులతో సమావేశాలు



నాయకులతో సమాలోచనలు చేస్తూ...

ఉదయం ఆరు గంటలకు నిద్ర లేచి కాలకృత్యాలు తీర్చుకున్నారు. ఏడు గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకుని తండ్రి జీఎంసీ బాలయోగి చిత్రపటానికి నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. 8.20 గంటలకు కార్యాలయం నుంచి ముమ్మిడివరం నియోజవర్గ పరిధిలోని తాళ్లరేవు బయలుదేరి 9 గంటలకు చేరుకున్నారు. అక్కడ జరిగిన రోడ్ షోలో పాల్గొన్నారు. 11.50 గంటలకు తాళ్లరేవు మండల కూటమి సమావేశంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాట్ల సుబ్బరాజుతో కలిసి మాట్లాడారు. 12.20 గంటలకు అయినవిల్లిలంక చేరుకున్నారు. 12.50 గంటలకు అయినవిల్లిలంకలో కూటమి సమావేశంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 1.40 గంటలకు చింతనలంక చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. 2.10 గంటలకు ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని పల్లంకుర్రు చేరుకున్నారు. గ్రామ దేవత ఆలయంలో పూజలు చేశారు. 2.30 గంటలకు పల్లంకుర్రు రోడ్‌షోలో పాల్గొన్నారు. మూడు గంటలకు గ్రామంలోని పల్లంకుర్రు బాబు ఇంటికి చేరుకుని భోజనం చేశారు. 3.30 గంటలకు పల్లంకుర్రు నుంచి బయలుదేరారు. నాలుగు గంటలకు ఐ.పోలవరం మండలం పశువుల్లంక చేరుకుని ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. 4.20 గంటలకు పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని వాడ్రేవుపల్లి చేరుకున్నారు. సాయంత్రం ఆరు గంటలకు మానేపల్లిలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి ఏడు గంటలకు సఖినేటిపల్లి నుంచి ప్రారంభమైన హరీష్‌మాధుర్ రోడ్ షో రాత్రి పది గంటలకు తాటిపాక సెంటరుకు చేరుకుంది.

తండ్రి బాలయోగి ఆశయాల సాధనకు కృషి

లోక్‌సభ దివంగత స్పీకర్, నా తండ్రి జీఎంసీ బాలయోగి ఆశయాల సాధనకు కృషి చేస్తాను. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో లంక గ్రామాల రక్షణకు, నదీకోత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాను. రైతులు మూడు పంటలు పండించే విధంగా పంట కాల్వలు, డ్రైనేజీలను పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తాను. రైల్వే లైన్ నిర్మాణం పూర్తయ్యేలా కూటమి ప్రభుత్వ సహకారంతో నిధుల విడుదలకు కృషి చేస్తాను. తీర ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా, టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేస్తాను. వాటికోసం పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాను.





తాళ్లరేవులో రోడ్ షో (పైన) సుబ్బరాజుతో సమాలోచన



హరీష్‌మాధుర్‌ను అభినందిస్తున్న అల్లవరం జనసేన నాయకులు

నదీకోత నివారణకు రక్షణ చర్యలు: హరీష్



అమలాపురం టౌన్, మే 10: ఒక్క ఛాన్స్ ఇవ్వండని అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని నిలువునా ముంచేశారని అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ ఆరోపించారు. జగన్‌కు మరో ఛాన్స్ ఇవ్వకూడదని రాష్ట్ర ప్రజలంతా ఫిక్స్ అయిపోయారన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ లేక యువత ఈసారి కసిగా ఓటేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మాట తప్పను. మడమ తిప్పను అంటూ ఉద్యోగులు, మహిళలు, యువతకు ఇచ్చిన ప్రధాన హామీలు అన్నింటినీ గాలికొదిలేశారన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం తాళ్లరేవు, అయినవిల్లిలంక గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో హరీష్ మాట్లాడారు. ముమ్మిడివరం మండలం కమిని, తాళ్లరేవు మండల పిల్లంక, కె.గంగవరం మండలం శేరిలంక గ్రామాల్లో ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే లంక గ్రామాల నదీకోత నివారణకు గ్రోయిన్లు, రివిట్‌మెంట్ వంటి రక్షణ చర్యలు చేపడతానన్నారు. పల్లంకుర్రు, తాళ్లరేవు, మానేపల్లి, వాడ్రేవుపల్లి గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. రాత్రి సఖినేటిపల్లి నుంచి తాటిపాక సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజుతో పాటు నాయకులు మద్దాల సుబ్బారావు, పల్లంకుర్రు బాబు, తాడి నరసింహారావు, లంక సుబ్బరాజు, చిన్నం మురళి, సలాది వెంకటస్వామి, అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావు, సాధనాల పండు, సలాది ఉమ, సుంకర అయ్యన్న, కాకర శ్రీనివాస్, సయ్యపురాజు సత్యనారాయణరాజు, నేదునూరి వీర్రాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

అల్లవరం, మే 10: ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అడిషనల్ ఎస్పీ కరణం కుమార్ కోరారు. శుక్రవారం ఆయన డీఎస్పీ మహేశ్వరరావుతో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల రోజున ఎటువంటి వివాదాలు తలెత్తకుండా సాయుధ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఏఎస్పీ వెంట అమలాపురం రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ హరీష్ వున్నారు.

ప్రలోభాలకు తెర.. ఓటర్లకు డబ్బు ఎర

అల్లవరం, మే 10: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయం సమీపిస్తున్న వేళ మండలంలో మండలంలో అధికారి పార్టీ ప్రలోభాలకు తెరదీసింది. ఐప్యాక్ బృందాల సాక్షిగా ఓటుకు రూ.1,500 వంతున అందిస్తున్నారు. మరో పార్టీ రూ.1,000 ఇస్తోంది. కడప ప్రాంతం నుంచి వచ్చిన ఐప్యాక్ సభ్యులు దగ్గరుండి వైసీపీ నాయకుల ద్వారా డబ్బులను పంపిణీ చేశారు. ఇరు రాజకీయ పార్టీలు ఇస్తున్న సొమ్మును ఓటర్లు తెలివిగా తీసుకుంటున్నారు. ఇప్పటివరకు సుమారు 70 శాతం మందికి డబ్బులు పంపిణీ చేశారు.

కోరింగలో షాడో పోలింగ్ కేంద్రం పరిశీలన

అమలాపురం టౌన్, మే 10: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు పరిశీలకుడు ఎంపీ చంద్రకాంత్ శుక్రవారం తాళ్లరేవు మండలం కోరింగలోని షాడో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. స్థానికులతో సమావేశమయ్యారు. పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. హోప్ ఐలాండ్‌లో నివసిస్తున్న వారంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా జిల్లాలో విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 771 ఎన్డీపీ లిక్కర్ బాటిళ్లు, 145.27 లీటర్ల ఐఎంఎల్, 163 డ్యూటీపెయిడ్ లిక్కర్ బాటిళ్లు, 57.57 లీటర్ల ఐఎంఎల్ స్వాధీనం చేసుకున్నారు.



ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం

అమలాపురం టౌన్, మే 10: ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎగ్జిట్ పోల్స్ నిర్వహించి ప్రసారం చేయడం చట్టవిరుద్ధమని కలెక్టర్ హిమాన్షు శుక్లా హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు అనుమతులు లేవన్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో వార్తా పత్రికల్లో రాజకీయ ప్రకటనలు చేయదలుచుకుంటే ముందుగానే ఎంసీఎంసీకి దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలి.

అభ్యర్థితో.. ఒకరోజు




కాలభైరవస్వామిని దర్శించుకుంటున్న జోగేశ్వరరావు, స్థానికులతో మాటామంతీ

మండపేటలో నాలుగోసారీ

పాగా వేసేది నేనే

వివిధ కుల సంఘాలు, ప్రజలతో మమేకం
ఉదయం నుంచి రాత్రి వరకు విరామమెరుగని ప్రచారం
మండపేట అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావుతో ఒక రోజు

మండపేటలో నాలుగోసారీ ఎమ్మెల్యేగా గెలుస్తానంటున్నారు కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు. శుక్రవారం జోగేశ్వరరావుతో 'ఆంధ్రజ్యోతి' ఒకరోజు ప్రయాణం సాగించింది. క్షణం తీరిక లేక, అలసట లేక విజయమే లక్ష్యంగా రోజంతా ప్రచారం సాగిస్తున్నారయన. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఓటర్లతో మమేకమవుతున్నారు. ఒకపక్క కుల సంఘాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ మరోపక్క రాజకీయ వ్యూహాలను రచిస్తూ బిజిబిజీగా గడపడాన్ని 'ఆంధ్రజ్యోతి' గుర్తించింది.

● మండపేట



ప్రచారం మధ్యలో దాహార్తి తీర్చుకుంటూ...

బిజీ షెడ్యూల్

ఉదయం 5 గంటలకే నిద్రలేచిన జోగేశ్వరరావు కాలకృత్యాలు తీర్చుకున్నారు. దైవారాధన, ప్రత్యేక పూజల అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. 9.45 గంటలకు బంగారు దుకాణాల వద్దవున్న కాలభైరవస్వామిని దర్శించుకుని బ్రాహ్మణుల ఆశీర్వాదం తీసుకున్నారు. వేగుళ్ల నాల్గవసారి విజయం సాధించి మంత్రిగా ప్రమాణం చేసి ఆలయానికి రావాలని బంగారు వ్యాపారులు ఆకాంక్షించారు.



సంఘాల ఆత్మీయ సమావేశాల్లో....

ఉదయం పది గంటలకు టీడీపీ కార్యాలయానికి చేరుకున్న వేగుళ్ల పార్టీ శ్రేణులు, ఇతరులతో సుమారు అర గంటసేపు పలు అంశాలపై చర్చించారు. పలు మీడియా సంస్థలకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఉదయం 11 గంటలకు సీతారామ కల్యాణ మండపంలో జరిగిన బ్రాహ్మణ సంఘ ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి బ్రాహ్మణులకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. కూటమికి ఎందుకు ఓటు వేయాలో తెలియజెప్పారు. నేర చరిత్ర కలిగిన తోట త్రిమూర్తులు కావాలో లేక సంక్షేమ ఫలాలు అందించే కూటమి ప్రభుత్వం కావాలో నిర్ణయించుకోవాలన్నారు. అధికారంలోకి రాగానే బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరిస్తామని భరోసా ఇచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు వల్లూరి నారాయణమూర్తి భవనంలో జరిగిన ఫొటోగ్రాఫర్ల సమావేశానికి హాజరయ్యారు. సుమారు అరగంటసేపు వారితో మాట్లాడారు. తోట త్రిమూర్తులు అవినీతిని మొబైల్‌లో వీడియోలో చూపించారు. అక్కడి నుంచి టీడీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయన అక్కడికి వచ్చిన వారితో అరగంట పాటు ముచ్చటించారు.మధ్యాహ్నం ఒంటి గంటకు అక్కడి నుంచి బయల్దేరి ఇంటికి చేరుకుని భోజనం చేసి కుటుంబ సభ్యులతో గడిపారు. 1.30 గంటలకు బయల్దేరి ముస్లింలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటికి చేరుకుని నాలుగు గంటల వరకు గడిపారు. రాత్రి ఏడు గంటల వరకు పార్టీ కార్యాలయంలో బిజిబిజీగా గడిపిన వేగుళ్ల 7.30 గంటలకు బయలుదేరి కపిలేశ్వరపురం మండలం నేలటూరు చేరుకుని బసవేశ్వర స్వామి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అక్కడ ఆలయ నిర్వాహకులు, చేనేత కార్మికులతో భేటీ అయ్యారు. రాత్రి ఎనిమిది గంటలకు మండపేటలోని పార్టీ కార్యాలయానికి చేరుకుని కార్యకలాపాలు చూసుకుని రాత్రి పది గంటలకు ఇంటికి చేరుకున్నారు.



వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు అరాచకాలను మొబైల్‌లో చూపిస్తున్న వేగుళ్ల



బ్రాహ్మణ సంఘ ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న జోగేశ్వరరావు



ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వేగుళ్ల

సఖినేటిపల్లి లంక రేవు నుంచి విజయీభవ ర్యాలీ చేపట్టిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాజోలు అభ్యర్థి దేవ వరప్రసాద్

ఉత్సాహంగా సాగిన విజయీభవ ర్యాలీ





మలికిపురం: విజయీభవ ర్యాలీలో ప్రజలకు దేవ వరప్రసాద్ అభివాదం, సఖినేటిపల్లిరేవు నుంచి ర్యాలీగా దేవ వరప్రసాద్, జబర్దస్త్ కమెడియన్ గెటప్ శ్రీను, రాజోలులో ర్యాలీలో పాల్గొన్న కూటమి శ్రేణులు

రాజోలు, మే10: సఖినేటిపల్లి మండలంలో సఖినేటిపల్లిలంక రేవు వద్ద నుంచి శుక్రవారం మధ్యాహ్నం 4గంటలకు విజయీభవ ర్యాలీ ప్రారంభమైంది. సఖినేటిపల్లి రేవు నుంచి తాటిపాక వరకు విజయీభవ ర్యాలీలో వేలాదిగా కూటమి శ్రేణులతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. సఖినేటిపల్లి నుంచి మూడు తూములు, టేకిశెట్టిపాలెం, మలికిపురం వరకు విజయీభవ ర్యాలీ సాగింది. రాజోలు కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్, అమలాపురం పార్లమెంటు అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, జనసేన పార్టీ స్టార్ క్యాంపెయినర్ గెటప్ శ్రీను ప్రజలకు అభివాదం చేసుకుంటూ ర్యాలీ ముందుకు సాగింది. మలికిపురం నుంచి విశ్వేశ్వరాయపురం లక్కవరం మీదుగా రాజోలు మండలం చింతలపల్లి శివకోడు మీదుగా రాజోలుకు ర్యాలీ చేరుకుంది. రాజోలులో రోడ్లన్నీ వేలాది మందితో నిండిపోయాయి. రాజోలు నుంచి సోంపల్లి, పొదలాడ మీదుగా తాటిపాక వరకు విజయీభవ ర్యాలీ చేరుకుంది. ర్యాలీలో జనసేన పార్టీ స్టార్ క్యాంపెయినర్ గెటప్ శ్రీను ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మామిడికుదురు మండలం ఈర్లచెరువు, చేరితోట, గాలిదేవరపాలెంలో కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలన్నీ తీరుస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, గెడ్డం మహలక్ష్మి, దిరిశాల బాలాజీ, రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, మొల్లేటి శ్రీనివాస్, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, రాజోలు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, గుండుబోగుల పెదకాపు, మంగెన భూదేవి, బందెల పద్మ, మోకా పార్వతి, వైస్ ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు, ఉండపల్లి అంజి, చిట్టూరి సంతోష్, ఆరుమిల్లి సాయిబాబు, మెరుగుమువ్వల సత్యవరప్రసాద్, పామర్తి రమణ, అడబాల విజయ్, గుబ్బల కుమార్, కడలి వెంకటరమణారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ఈనెల13న జరగనున్న ఎన్నికల్లో గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని, అమలాపురం పార్లమెంటు కూటమి అభ్యర్థి గంటి హరీష్ మాధుర్‌కు సైకిల్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ర్యాలీకి వేలాది టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేసినందుకు ఆయన ప్రతీఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



ఈర్లచెరువులో ప్రజల సమస్యలు వింటున్న దేవ వరప్రసాద్

టీడీపీలో చేరిన గొంది సర్పంచ్ రవికుమార్

అంతర్వేది, మే 10: వైసీపీ అరాచక పాలన నచ్చక వైసీపీకి రాజీనామా చేసి గొంది సర్పంచ్ దొండపాటి రవికుమార్ టీడీపీలో చేరారు.కొల్లు రాము, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల సమక్షంలో కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.

కూటమి ప్రభుత్వంతోనే అన్నివర్గాలకు న్యాయం






ముమ్మిడివరం మండలం చినకొత్తలంకలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు ఎన్నికల ప్రచార దృశ్యాలు

ముమ్మిడివరం, మే 10: రాష్ట్రంలో అరాచక, విధ్వంసక పాలనను అంతమొందించేందుకు ప్రజలంతా కూటమి అభ్యర్థుల ఎన్నికకు సహకరించాలని కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం ముమ్మిడివరం మండలం చినకొత్తలంకలో శుక్రవారం ఆయన కూటమి నాయకులు, కార్యకర్తలతో ప్రచారం నిర్వహించారు. కూటమి మేనిఫెస్టోలోని సూపర్-6 పథకాలను వివరించి ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి కూటమి అభ్యర్థులు గంటి హరీష్‌మాధుర్, తనను గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామంలో అడుగడుగునా మహిళలు మంగళ హారతులు, పూలమాలలతో స్వాగతం పలికారు. టీడీపీ హయాంలో గ్రామాల సమాగ్రాభివృద్ధి జరిగిందని, వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. సంక్షేమ పథకాల పేరుతో అభివృద్ధిని విస్మరించి వైసీపీ పార్టీ నాయకులు ప్రజాధనాన్ని జేబుల్లో నింపుకున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రజా సంక్షేమం విజన్ ఉన్న చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు జీవో ప్రతులను తగులపెట్టారు. ఈల్యాండ్ టైటిలింగ్ చట్టం వల్ల భూమి యజమానులకు ఉన్న హక్కులు కోల్పోతారన్నారు. భూ యజమానుల హక్కులను కాజేయాలనే దురుద్దేశంతో జగన్ ప్రభుత్వం ఈ నల్ల చట్టాన్ని తీసుకువచ్చిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నల్ల చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. గుత్తుల సాయి, దొమ్మేటి రమణకుమార్, పొత్తూరి విజయభాస్కరవర్మ, పెద్దిరెడ్డి సత్యగోపాలకృష్ణ, వనచర్ల వెంకటేశ్వరరావు, పంతగడ సత్యనారాయణ, పొత్తూరి విజయభాస్కరవర్మ, పొత్తూరి మల్లికార్జునరావు, పచ్చమట్ల వీరవెంకటసత్యనారాయణరాజు, కుంచనపల్లి ఆదినారాయణ, గొల్లపల్లి గోపి, బొక్కా రుక్మిణి పాల్గొన్నారు.

నియోజవర్గాన్ని అభివృద్ధి చేస్తా

తాళ్లరేవు, మే 10: ఎంపీ, ఎమ్మెల్యే సంయుక్త నిధులతో ముమ్మిడివరం నియోజవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కూటమి ముమ్మిడివరం అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. స్థానికంగా గ్యాస్ కంపెనీల్లో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానన్నారు. సీఎస్ఆర్ నిధులతో తాళ్లరేవు మండలాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై దృష్టిసారించి మెరుగైన సేవలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తానన్నారు. శుక్రవారం తాళ్లరేవు పార్టీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఆత్మీయ సమ్మేళనం టీడీపీ నేత ధూళిపూడి వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా అమలాపురం పార్లమెంటు అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ కోనసీమ అభివృద్ధి ప్రధాత, తన తండ్రి బాలయోగి చేసిన అభివృద్ధి బాటలోనే పయనిస్తానన్నారు. తాలుత పోలేకుర్రు పంచాయతీ జైభీమ్‌పేట వద్ద టీడీపీ నేత జక్కల ప్రసాద్‌బాబు, మోర్త భైరవమూర్తి ఆధ్వర్యంలో హరీష్‌మాధుర్‌కి గజమాలతో స్వాగతం పలికారు. అక్కడ నుంచి బైక్‌ర్యాలీ నిర్వహించి తాళ్లరేవు, సీతారామపురం మీదుగా ర్యాలీ పార్టీ కార్యాలయానికి చేరుకుంది. గ్రామాల్లోని సమస్యలను టీడీపీ అధికారంలోకి రాగానే దశలవారిగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలంతా రెండు ఓట్లను సైకిల్‌గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీనేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, సర్పంచ్‌లు టిల్లపూడి నాగేశ్వరరావు, కోరుకొండ సింహాద్రమ్మ, పుణ్యమంతుల సూరిబాబు, ఎంపీపీ రాయుడు సునీత, వాడ్రేవు వీరబాబు, పెమ్మాడి కృష్ణవేణి, పొన్నమండ రామలక్ష్మి, మోపూరి శ్రీనివాస్‌కిరణ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ ప్రజాదరణే కూటమి ప్రభుత్వానికి సంకేతం





కొత్తపేట: మందపల్లిలో బండారు సత్యానందరావుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు, ప్రచారంలో బండారుకు హారతి ఇస్తున్న మహిళలు ఆత్రేయపురం: బొబ్బర్లంకలో టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న దృశ్యం

కొత్తపేట, ఏప్రిల్10: కొత్తపేట నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో లభిస్తున్నప్రజాదరణే కూటమి ప్రభుత్వం రానున్నదనే సంకేతం వస్తుందని ఆ పార్టీ అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం మందపల్లి, చెల్లిరేవు, శీలంవారిపాలెం, బొరుసువారి సావరం, గోగివారిపేట తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు పూలమాలలతో స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. అడుగడుగునా బాణసంచా కాల్పులతో ప్రచారంభారీ ఎత్తున సాగింది. ఈసందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్నివర్గాల ప్రజలు చూపిస్తున్న ఆదరణ మరువలేనన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలతో ప్రజలు విసుగుచెందారని, ముఖ్యంగా యువకులు ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ధరల భారంతో పేద, మధ్య తరగతి, సామాన్య వర్గాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులు పంట అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నా రన్నారు. ఎవ్వరి భూములు వారికి దక్కకుండా ఉండేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తీసుకురావడంపై ఆయన మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దుచేస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాలు, వాటితో సమానంగా అభివృద్ధిచేసి చూపిస్తామ న్నారు. ప్రజలందరూ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న హరీష్‌మాధుర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, పాలూరి సత్యానందం, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



టీడీపీలో చేరికలు

ఆత్రేయపురం, మే10: బొబ్బర్లంకలో 20కుటుంబాలకు చెందిన వారు శుక్రవారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారందరికీ టీడీపీ నాయకులు జల్లి కామేశ్వరరావు, నరాలశెట్టి వెంకన్న, జ్ఞాన శ్రీను, చల్లపూడి నాగేష్ పార్టీ కండువాలు వేశారు. అనంతరం వివిధగ్రామాల్లో బండారు సత్యానందరావు విజయంకోరుతూ ప్రచారం నిర్వహించారు.

లంక గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి




పి.గన్నవరంలో మేనిఫెస్టోను వివరిస్తున్న గిడ్డి సత్యనారాయణ, లంకలగన్నవరంలో మహిళలతో కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ



జనసేనలో చేరిన వారికి కండువా వేస్తున్న గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, మే 10: నియోజకవర్గంలోని లంక గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కృషిచేస్తానని కూటమి అసెంబ్లీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ అన్నారు. లంకగన్నవరం, వాడ్రేవుపల్లి, మానేపల్లి గ్రామాల్లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గిడ్డి సత్యనారాయణకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి గుమ్మడికాయలతో దిష్టితీశారు. ఇంటింటికి తిరిగి కూటమి మేనిఫెస్టోను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గోదావరి వరదలకు ఇబ్బందులు పడే గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తానన్నారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. లంకగన్నవరంలో కుమ్మరిశాలి వాహన సంఘ సభ్యులు గిడ్డి సత్యనారాయణను కలిసి సత్కరించారు. లంకగన్నవరంలో వైసీపీని వీడి పలువురు జనసేన పార్టీలో చేరారు. వాడ్రేవుపల్లిలో ఆర్యవైశ్య సంఘ నాయకుడు పట్నాల దత్తాత్రేయ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు కలిసి అభినందించారు. అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు అడుగడుగునా నీరజనాలు పలికారు. మహిళలు ఆయనతో సెల్ఫీలు దిగారు. నియోజకవర్గ కో కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాద్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, సర్పంచ్‌లు పసలపూడి రామకృష్ణ, ప్రత్తిపాటి ఉమామహేశ్వరి, బొండాడ నాగమణి, ఎంపీటీసీలు పాలూరి వీరభద్రం, ఆదిమూలం సూర్యనారాయణ, పులపర్తి చిన్నవెంకటలక్ష్మి, పప్పుల సాయిబాబు, నేలపూడి దామోదర్, నాయకులు తోలేటి సత్తిబాబు, వాసంశెట్టి కుమార్, సంసాని పెద్దిరాజు, సాధనాల జేడి, లంకే చిరంజీవి పాల్గొన్నారు.

ఇంటింటా కూటమి కార్యకర్తల ప్రచారం



తొత్తరమూడిలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

అయినవిల్లి, మే 10: కూటమి అభ్యర్థుల విజయాన్ని కోరుతూ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. శుక్రవారం తొత్తరమూడిలో పార్లమెంటు అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌కు సైకిల్ గుర్తుపైన, అసెంబ్లీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు గాజు గ్లాసు గుర్తుపైనా ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కూటమి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కడలి వెంకటసత్యనారాయణ(పెద్ద), మద్దాల ఫణి, గుత్తుల బాబి, చిట్టూరి విజయ్, కముజు రాంప్రసాద్, ఎ.రాజు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

యానాం అధికారులతో ఎన్నికల అధికారి సమీక్ష

యానాం,మే10: ఆంధ్రప్రదేశ్‌లో సోమవారం సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాకినాడ జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ కె.గణేష్ శుక్రవారం యానాం పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్‌ఏ, యానాం ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖర్, ఎన్నికల అధికారులతో సమీక్షించారు. కాకినాడ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకుయానాంఅధికారులను సమన్వయం చేయడం, వివిధ అంశాలపై చర్చించారు.

ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర పురోగతి సాధ్యం





వెంకటాయపాలెంలో పెద్దాయనకు అభివందనం, కుందాలమ్మచెరువులో దివ్యాంగునితో కరచాలనం, అంబికపల్లి అగ్రహారంలో అంబేద్కర్‌కు నివాళి



పద్మశాలీ సంఘీయుల సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్

ద్రాక్షారామ, మే 10: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం పురోగతి సాధిస్తుందని కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం మాలపాడు, అంబికపల్లి అగ్రహారం, వెంకటాయపాలెం, కుందాలమ్మచెరువు గ్రామాల్లో కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంబికపల్లి అగ్రహారంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటి ప్రచారం జరిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ విత్తనాల వెంకటరమణ, టీడీపీ నాయకులు కొత్తపల్లి శ్రీను, కోటి ఏడుకొండలు పాల్గొన్నారు. వెంకటాయపాలెంలో దాసరిపాడు, ఎస్సీకాలనీ, చిన్నంపేట, యల్లంపంపు, రామనరసతోటలో ఎన్నికల ప్రచారం జరిపారు. వాసుదేవమూర్తి ఆలయంలో పూజలు జరిపారు. జనసేన నాయకులు కణితి రాంబాబు, కొండేటి గణేష్, గంధం ఉమాశంకర్, టేకుమూడి శ్రీనివాస్, యర్రంశెట్టి భీమశంకరం పాల్గొన్నారు.

చేనేతలకు అండగా ఉంటా: సుభాష్

కె.గంగవరం, మే 10: చేనేత కార్మికులకు అండగా ఉంటానని రామచంద్రపురం నియోజకవర్గం కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని పద్మశాలీయులు అందరూ సుభాష్‌కు మద్దతు ప్రకటించారు. కె.గంగవరంలోని తాడాల రాంబాబు రైస్‌మిల్లులో వారు సమావేశం నిర్వహించుకుని 15వేల వరకూ ఓటింగ్ ఉన్న తమ సంఘీయులు సుభాష్ విజయానికి కృషి చేస్తామని ప్రకటించారు. రేవు శ్రీను, పొలిశెట్టి చంద్రశేఖర్, గంధం పల్లంరాజు, గొల్లపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.